సాక్షి సిద్దిపేట

బుధవారం । 6 । నవంబర్ । 2024



చిరుధాన్యాల సాగును..

డక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ చిరుధాన్యాల సమాఖ్య ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలో జాతీయ సదస్సు ప్రారంభమైంది.

వివరాలు 8లో ▸



తేమశాతంపై తకరారు

ధాన్యం కొనుగోలులో తేమశాతంపై కొడిపల్లి మండలం ధర్మాసాగర్, సదాశివపల్లి రైతులు నిలదీశారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు.

వివరాలు 8లో ▸



విద్యార్థుల మాక్ పోలింగ్

హుస్నాబాద్ పట్టణంలో విద్యార్థులకు మాక్‌పోలింగ్‌పై అవగాహన కల్పించారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నేడు చెస్ క్రీడాకారుల ఎంపిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో బుధవారం ఉమ్మడి మెదక్ జిల్లా చెస్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సౌందర్యలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్-14, 17 విభాగంలో చెస్ క్రీడాకారుల ఎంపిక చేయనున్నట్లు, ఆసక్తి కల్గిన క్రీడాకారులు బుధవారం ఉదయం 10గంటలకు గజ్వేల్ పట్టణంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు ఫిజికల్ డైరెక్టర్లు ఎలియాస్‌రావు (99891 70936), నగేష్ (99087 89877)లను సంప్రదించాలన్నారు.

రేపు మినీజాబ్ మేళా

సిద్దిపేటరూరల్: ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సెట్విన్ ఆధ్వర్యంలో ఈనెల 7న మినీజాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి నీల రాఘవేందర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ ప్రైవేటు కంపెనీలు పాల్గొననున్నట్లు తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు విద్యార్హత ధ్రువపత్రాలతో సెట్విన్ కేంద్రంలో ఉదయం 11 గంటలకు జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.10వేల నుంచి రూ. 20 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న ఆర్టీసీ జేఏసీ నాయకులు

సిద్దిపేటరూరల్: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఎండీ. మౌలానా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కార్మికులకు అనేక హామీలను ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా నేటికీ హామీలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శనలు, సామూహిక నిరాహార దీక్షలు చేసినా ఎలాంటి స్పందన లేదన్నారు. ప్రభుత్వంలో విలీనం చేయడానికి గెజిట్ విడుదల అయినందున తక్షణం స్పందించి అపాయింట్‌మెంట్ డేను ప్రకటించి జీఓ విడుదల చేయాలన్నారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలన్నారు. ప్రైవేటు బస్సులు రద్దు చేసి, నూతన బస్సులు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి, శేషు, నూరుద్దీన్, రవి పాల్గొన్నారు.

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు భాస్కర్



మిరుదొడ్డి(దుబ్బాక): మలేషియా తెలంగాణ అసోసియేషన్ 10వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే దశాబ్ది ఉత్సవాలకు అందె గ్రామానికి చెందిన ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత అందె భాస్కర్‌కు ఆహ్వానం లభించింది. ఈ నెల 9న మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగే ఉత్సవాల్లో భాస్కర్ పాల్గొననున్నారు. రాష్ట్రం నుంచి పలువురు కళాకారులు పాల్గొనే ఈ ఉత్సవాల్లో భాస్కర్ డప్పు వాయిద్యాన్ని ప్రదర్శించనున్నారు.

భూసారాన్ని కాపాడుకుందాం



భూసార పరీక్షలు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక

చిన్నకోడూరు(సిద్దిపేట): పంట సాగుకు ముందు భూసార పరీక్షలు చేయించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక అన్నారు. మంగళవారం రాముని పట్లలో భూసార పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షలతో నేలలో లభ్యమయ్యే పోషకాలు, ఏదైనా సమస్యలు ఉంటే తెలుసుకోవచ్చన్నారు. పంట దిగుబడులకు భూసార పరీక్ష కీలకమన్నారు. రసాయన ఎరువులను విచ్చలవిడిగా వినియోగించడం వల్ల నేలలు దెబ్బతింటున్నాయని, ఫలితంగా పంటల దిగుబడి తగ్గుతుందన్నారు. నేలలోని కార్బన్ శాతాన్ని ఏ విధంగా పెంచాలి, పెంచడం వల్ల కలిగే లాభాలు వివరించారు. ప్రతి ఒక్కరూ సేంద్రియ వ్యవసాయం వైపులు అడుగులు వేయాలన్నారు.

లబ్ధిదారులతో చెలగాటం

ఎస్సీ కార్పొరేషన్ అనాలోచితం



తమిళనాడు రాష్ట్రం కరూర్‌లో లబ్ధిదారులు

- దిశానిర్దేశం లేకుండానే 44 మంది తమిళనాడుకు..
- పశువులు కొనుగోలు చేయకుండానే తిరుగు ప్రయాణం
- లబ్ధిదారులకు శిక్షణ ఇవ్వలేదని వెళ్లని పశు వైద్యులు

ఎస్సీ కార్పొరేషన్.. లబ్ధిదారులతో చెలగాటం ఆడుతోంది. ఎంపికైన లబ్ధిదారులను పాడి పశువుల కోసం తమిళనాడుకు ఎస్సీ కార్పొరేషన్ పంపించింది. నాలుగు రోజులు పడిగాపులు కాసి పశువులు లేకుండానే తిరుగు ప్రయాణమయ్యారు. కొనుగోలు కమిటీతో పాటు ప్రభుత్వ పశు వైద్యుడు లబ్ధిదారుల వెంట వెళ్లి పశువులను పరిశీలించి కొనుగోలు చేయాలి. అలాంటిదేమీ లేకుండానే తమిళనాడుకు 44 మంది లబ్ధిదారులు వెళ్లారు. తీరా వట్టిచేతులతో మంగళవారం సాయంత్రం బయలు దేరారు.

సాక్షి, సిద్దిపేట: పాడిరంగాన్ని అభివృద్ధి చేస్తూనే.. చేయూతను అందించేందుకు ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ ద్వారా పాడి పశువులను అందిస్తోంది. 2021–22 సంవత్సరానికి గాను 1000 పాడి పశువుల యూనిట్లు టార్గెట్. అయితే 618 యూనిట్లకు సబ్సిడీ విడుదల కాగా 266 గ్రౌండ్ అయ్యాయి. ఒక్కో యూనిట్ విలువ రూ.2లక్షలు. ఇందులో ప్రభుత్వం రూ.1.40లక్షల సబ్సిడీ అందిస్తోంది. ఇందుకు ఒక్కో లబ్ధిదారుడు రూ.65వేలు బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు. బెజ్జంకి మండలానికి చెందిన 44 మంది లబ్ధిదారులు ఈ నెల 1న తమిళనాడు రాష్ట్రం కరూర్ జిల్లాకు పశువులను కొనుగోలు చేసేందుకు వెళ్లారు.

శిక్షణ లేకుండానే ..

పాడి పశువుల పెంపకం గురించి లబ్ధిదారులకు ఒక రోజు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ శిక్షణ ఇవ్వకుండానే ఎస్సీ కార్పొరేషన్ అధికారులు తొందరపడి లబ్ధిదారులను పంపించారు. ఇతర రాష్ట్రాల నుంచి పాడి పశువులు తీసుకువస్తున్నారు కాబట్టి పాలు పితకటం, ఎలాంటి గడ్డి? దాణా ఏమి అందించాలి? తీసుకోవాల్సిన జాగ్రత్తల పై పశువైద్యులు శిక్షణ ఇస్తారు. అలాంటిది ఏమీ లేకుండానే పశువులను కొనుగోలు చేసేందుకు లబ్ధిదారులను తమిళనాడుకు పంపించారు.

> **త్వరలో అందిస్తాం**
>
> బెజ్జంకి మండలంలో 44 మంది లబ్ధిదారులను తమిళనాడుకు పంపించాం. అందులో 11 మంది కొనుగోలు చేయబోమని తిరిగి వచ్చారు. 33 మంది ఉండగా అందులో 25 మంది పశువులను ఎంపిక చేశారు. ఇంకా కొనుగోలు చేయలేదు. పశువైద్యుడు, ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన సిబ్బంది వెళ్లి లబ్ధిదారులు ఎంపిక చేసిన పశువులను సర్టిఫై చేస్తే వాటిని లబ్ధిదారులకు అందజేస్తాం.
>
> \- శ్రీరాంరెడ్డి, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

పశువులను సర్టిఫై చేయాలి



లబ్ధిదారులకు అందించే పశువులు గర్భంతో ఉన్నవి కొనుగోలు చేయాలి. పశువులు ఎన్ని రోజుల గర్భం దాల్చింది? ఆరోగ్యంగా ఉన్నాయా? అని పశువైద్యులు పరిశీలించి సర్టిఫై చేయాలి. అప్పుడే ఆ పశువులను కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందించాలి. లబ్ధిదారులకు శిక్షణ ఇవ్వకుండానే పశువులు ఎలా అందిస్తారని పశు వైద్యులు వెళ్లలేదు. దీంతో లబ్ధిదారులు పశువులు లేకుండానే మంగళవారం రాత్రి తమిళనాడు నుంచి నిరాశతో వెనుతిరిగారు. 'అన్ని పనులు వదిలిపెట్టుకుని తమిళనాడుకు వచ్చామని, పశువులు లేకుండానే తిరిగి వస్తున్నామని లబ్ధిదారులు ఫోన్‌లో ఆవేదన వ్యక్తం చేశారు.

సర్వేకు సర్వం సిద్ధం

జిల్లాలో 3.45లక్షల గృహాలు

- 2,538 మంది ఎన్యూమరేటర్లు
- 252 మంది సూపర్‌వైజర్లు
- నేటి నుంచి కుటుంబ సమగ్ర సమాచారం సేకరణ



అధికారులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ మనుచౌదరి (ఫైల్)

సాక్షి, సిద్దిపేట: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమాచార సేకరణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని సర్వే చేపడుతోంది. బుధవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించనున్నారు. సుమారు 75 ప్రశ్నలతో కూడిన సమాచారాన్ని సేకరించనున్నారు. ఇందుకోసం జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది.

3.45 లక్షల గృహాలు

జిల్లాలో 26 మండలాల్లో 3,45, 312 నివాస గృహాలున్నాయి. వీటిని 2,302 ఎన్యూమరేటర్ల బ్లాక్‌లుగా గుర్తించారు. ఈ సర్వే కోసం 2,538 మంది ఎన్యూమరేటర్లు, 252 మంది సూపర్‌వైజర్లను ఎంపిక చేసి శిక్షణ సైతం ఇచ్చారు. పట్టణాల్లో నోడల్ అధికారులుగా మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్డీఓలు నోడల్ అధికారులుగా వ్యవహరించనున్నారు. ఎడ్యుకేషన్, రెవెన్యూ అధికారుల సహాయంతో సర్వే నిర్వహించనున్నారు. ఒక్కో ఎన్యూమరేటర్‌కు 150 నుంచి 175 గృహాలు సర్వే చేయాల్సి ఉంటుంది. ఈ నెల 6, 7, 8 తేదీలలో ఇళ్లను గుర్తించి ఇంటి యజమాని ఫోన్ నంబర్‌ను సేకరించనున్నారు. ప్రశ్నావళి రూపంలో సర్వేను నిర్వహించనున్నారు. తర్వాత మళ్లీ ఇంటింటి పూర్తి సమాచారాన్ని సేకరించనున్నారు.

75 ప్రశ్నలు

సర్వేలో 56 ప్రధాన, 19 అనుబంధ కలిపి మొత్తం 75 ప్రశ్నలు ఉండనున్నాయి. కుటుంబ యజమాని సభ్యుల వ్యక్తిగత వివరాలు, కింద సాధారణ విద్యా ఉద్యోగ, ఉపాధి భూములు, రిజర్వేషన్ ప్రయోజనాలు రాజకీయ సమాచారం అడిగి తెలుసుకోన్నారు. కుటుంబంలో ఎవరైనా వలస వెళ్తే వారి వివరాలు సైతం నమోదు చేస్తారు.

ఇవి దగ్గర ఉంచుకోవాలి

ఆధార్ కార్డులు, రైతులయితే ధరణి పాసు పుస్తకాలు, ఆహార భద్రత కార్డు, ఇంటి పన్ను రశీదు దగ్గర పెట్టుకుంటే ఎన్యూమరేటర్లు వచ్చినప్పుడు సులువుగా సర్వే పూర్తవుతుంది.

తొలుత గృహాల గుర్తింపు

సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా తొలుత మూడు రోజులు గృహాలను ఎన్యూమరేటర్లు గుర్తించనున్నారు. తర్వాత ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించనున్నారు. ఇప్పటికే ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చాం. సర్వే కోసం అన్ని సిద్ధం చేశాం.

\- మనుచౌదరి, కలెక్టర్

సన్నవడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి

కలెక్టర్‌కు రైతుల విన్నపం



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

చేర్యాల(సిద్దిపేట): సన్నవడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని నాగపురి గ్రామ రైతులు కలెక్టర్ మనుచౌదరికి విన్నవించారు. శభాష్‌గూడెం, పెద్దరాజుపేట, నాగపురి, పోతిరెడ్డిపల్లి గ్రామాలకు కలిపి మరొక సన్నవడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కలెక్టర్, పీడీలని కోరారు. మంగళవారం మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ మనుచౌదరి, ప్రాజెక్టు డైరెక్టర్ అజయ్ దేవ్ ఆర్య, అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు విన్నవించారు.

రోగనిరోధక టీకాలపై అవగాహన అవసరం

రాష్ట్ర సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మురారి రాజేంద్రప్రసాద్

సిద్దిపేటకమాన్: రోగనిరోధక టీకాలపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని రాష్ట్ర సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మురారి రాజేంద్రప్రసాద్ అన్నారు. జిల్లాలోని వైద్యాధికారులకు సిద్దిపేట ఐఎంఏ హాల్‌లో మంగళవారం వ్యాధి నిరోధక టీకాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురారి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ..ఇమ్యునైజేషన్ కార్యక్రమం అమలు, హెచ్ఎంఐఎస్ రిపోర్టింగ్ అంశాలు, యువిన్ పోర్టల్, డిఫ్తీరియా, రుబెల్లా, మీజిల్స్, పోలియో వ్యాధుల సర్వైలెన్స్ పైన శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పిల్లలకు వంద శాతం పూర్తిగా వ్యాధి నిరోధక టీకాలు అందించాలన్నారు. క్షేత్ర స్థాయిలో వైద్యాధికారులు ప్రతి బుధ, శనివారం నిర్వహించే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించే విధంగా పర్యవేక్షణ ఉండాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వలస వచ్చిన పిల్లలపై, హైరిస్క్ ఏరియాల్లో నివసిస్తున్న పిల్లల పైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. గర్భిణులకు, పిల్లలకు పూర్తి స్థాయిలో వ్యాధి నిరోధక టీకాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువిన్ పోర్టల్ కన్సల్టెంట్ జ్యోత్స్న, ప్రోగ్రాం ఆఫీసర్, డాక్టర్ ఆనంద్, డాక్టర్ శ్రీకాంత్, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీని అమలు చేయాల్సిందే



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న తపస్ నాయకులు

- తపస్ జిల్లా అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి
- కలెక్టరేట్ ఎదుట నాయకుల నిరసన

సిద్దిపేటరూరల్: పీఆర్‌సీని వెంటనే అమలు చేసి సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఊడెం రఘువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం తపస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగారు. అనంతరం అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఊడెం రఘువర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళీ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. పీఆర్‌సీని వెంటనే అమలు చేసి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పబ్బతి శ్రీనాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్సిరెడ్డి, మహేందర్‌రెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

8 నుంచి హుస్నాబాద్‌లో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్

హుస్నాబాద్: పట్టణంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగాంగా మంగళవారం పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి అండర్ -14 బాల బాలికల హ్యాండ్ బాల్ జట్ల ఎంపిక పోటీలు మినీ స్టేడియంలో నిర్వహించారు. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల నుంచి బాలుర విభాగంలో 120 మంది, బాలికల విభాగంలో 105 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు హుస్నాబాద్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో మెదక్ ఉమ్మడి జిల్లా తరఫున పాల్గొంటారు. ఈ ఎంపిక పోటీల్లో ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాస్, సుజాత, రఫాద్ ఒమర్, పీఈటీలు ఓం ప్రకాశ్‌రెడ్డి, లింగేశ్వరి, రవి, విశాల, కృష్ణ పాల్గొన్నారు.



నేత్రపర్వం.. దీపోత్సవం

నాచగిరిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

హరిహరులకు ప్రీతికరమైన కార్తీక మాసంలో నాచగిరి లక్ష్మీనృసింహక్షేత్రం ప్రతినిత్యం సాయం సంధ్య వేళ సామూహిక భక్తజన కార్తీకదీపోత్సవంతో అలరారుతున్నది. మంగళవారం ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపోత్సవం నేత్రపర్వం చేసింది. శుభకరమైన కార్తీకంలో దైవదర్శనం, దీపారాధన శుభకరమని, నాగుల చవితి పర్వదినం కలిసిరావడంతో భక్తులు భారీగా నాచగిరి సందర్శించారు. గర్భగుడిలో దేవతామూర్తులను దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపోత్సవంలో పాల్గొని దీపాలు వెలిగించారు. స్వామివారి ఆశీస్సులు పొందారు.

\- వర్గల్(గజ్వేల్)

ప్రాథమిక పాఠశాలల మూసివేత తగదు

టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరెడ్డి



చిన్నకోడూరులో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ సమగ్ర సర్వే కోసం ప్రాథమిక పాఠశాలలను మధ్యాహ్నం పూట మూసివేయడం తగదని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దకోడూరు, చంద్లాపూర్, రామంచ, అల్లీపూర్, చిన్నకోడూరు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు, సమస్యల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు సర్వే డ్యూటీలు వేయడం వల్ల ప్రాథమిక విద్య కుంటుపడుతుందన్నారు. దివ్యాంగ ఉపాధ్యాయులకు, అనారోగ్య సమస్యలతో బాధపడే ఉపాధ్యాయులకు ఈ సర్వే నుండి మినహాయింపు ఇవ్వాలన్నారు. విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం వీడాలన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు మహేందర్, ప్రధాన కార్యదర్శి దేవఋషి, నాయకులు పాల్గొన్నారు.

మెడిసిన్ విద్యార్థినికి ఎస్‌బీఐ రుణం



రుణ మంజూరు పత్రం అందిస్తున్న బ్యాంకు అధికారి

హుస్నాబాద్‌రూరల్: మండల పరిధిలోని భల్లునాయక్ తండాకు చెందిన మెడిసిన్ విద్యార్థినికి ఎస్‌బీఐ రుణం మంజూరు చేసింది. గిరిజన విద్యార్థిని లావణ్య దేవి ఎంబీబీఎస్ సీటు సాధించడంతో ఆర్థిక ఇబ్బందుల వల్ల కూలీ పనులకు వెళ్తోంది. 'డాక్టర్ చదువుకు డబ్బులు లేక కూలీ పనులకు..' శీర్షికన సాక్షిలో వచ్చిన కథనానికి ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసు శెట్టి స్పందించారు. గిరిజన విద్యార్థిని మెడిసిన్ చదువుకు కావాల్సిన ఫీజు రూ.7.50లక్షల రుణం మంజూరు చేయించారు. మంగళవారం బ్యాంకు అధికారులు తండాకు వెళ్లి విద్యార్థినికి రుణ మంజూరు పత్రం అందించారు.

నల్లాలకు మోటార్లు బిగించొద్దు

- అందరికీ మంచినీరు అందిస్తాం
- ఫుట్‌పాత్ ఆక్రమిస్తే చర్యలు
- మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్



మున్సిపల్ నల్లాకు ఉన్న మోటారును పరిశీలిస్తున్న కమిషనర్ ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు సరిపడా తాగునీరు అందించాలనేది బల్దియా లక్ష్యమని కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అన్నారు. ఎవ్వరూ నల్లాలకు మోటార్లు బిగించొద్దని సూచించారు. మంగళవారం ఆయన పట్టణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్థానిక 33 వార్డులో ఇంటింటికి వెళ్లి తాగునీరు సరఫరా ప్రక్రియ పరిశీలించారు. కొందరు ఇళ్లలో నల్లాలకు మోటార్లు బిగించడం గమనించి వాటిని సిబ్బంది ద్వారా తొలగించారు. అలాగే మోటార్లను సీజ్ చేశారు. అన్ని ఇళ్లకు నీరు అందించే బాధ్యత ఉందని, మోటార్లు ఏర్పాటు చేయడం వల్ల మిగతా ప్రాంతాలకు తాగునీరు సరఫరా ఇబ్బందిగా మారుతుందని అన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలన్నారు. అలాగే మురికి కాలువల్లో చెత్తను చూసి తొలగించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం హనుమాన్‌నగర్‌లో పర్యటించారు. యూజీడీ సమస్యలు పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశించారు. పలు హోటళ్లను తనిఖీ చేశారు.

జరిమానాలు..

పట్టణంలో పర్యటిస్తున్న క్రమంలో మున్సిపల్ నిబంధనలు అతిక్రమించిన వారికి కమిషనర్ ఆశ్రిత్ కుమార్ జరిమానాలు విధించారు. నర్సాపూర్ చౌరస్తాలో నూతనంగా నిర్మిస్తున్న నేషనల్ మార్ట్ అనుమతి లేకుండా భవనానికి యూజీడీ కనెక్షన్ ఇవ్వడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. రూ.లక్ష జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. అదేవిధంగా అపరిశుభ్రంగా ఉన్న ఆహారాన్ని ఫ్రిజ్‌లో స్టోర్ చేసిన హయత్ హోటల్‌కు రూ.30 వేలు జరిమానా విధించారు.

అధికారులతో సమీక్ష..

అనంతరం మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పట్టణంలో ఫుట్‌పాత్ లను ఆక్రమించి నిర్మాణాలు, వ్యాపారాలు చేస్తున్న వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపార వాణిజ్య దుకాణాలు ఎదుట రేకుల షేడ్స్ ఏర్పాటు చేసి నిబంధనలు అతిక్రమిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, డీఈ ప్రేరణ, టీపీఓ దేవరాజ్, అధికారులు వనిత, మాధవి, ట్రాఫిక్ ఎస్ఐలు, పాల్గొన్నారు.

క్లుప్తంగా

కల్లు సీసాలో జెల్ల పురుగులు

పలువురికి అస్వస్థత



కల్లు సీసాలో జెల్లపురుగులు

రామాయంపేట(మెదక్): మండల పరిధిలోని కాట్రియాల గ్రామంలోని ఒక కల్లు దుకాణంలో కల్లుతాగిన పలువురు అస్వస్థతకు గురయ్యారు. ఇసుక అక్రమ రవాణా విషయమై మంగళవారం గ్రామంలో జరిగిన పంచాయతీ అనంతరం కొందరు కల్లు తాగడానికి దుకాణానికి వెళ్లారు. కల్లు తాగుతున్న క్రమంలో నర్సింహులు తాగిన సీసాలో జెల్ల పురుగులు వచ్చాయి. దీనితో ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్తులు .. దుకాణం వద్దకు వెళ్లి నిలదీశారు. వీరిలో కొందరికి వాంతులయ్యాయని గ్రామస్తులు తెలిపారు. చికిత్స నిమిత్తం నర్సింహులును రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కరెంటు షాక్‌తో ఎద్దు మృతి



ఎద్దు కళేబరం

తొగుట(దుబ్బాక): ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగిలి ఎద్దు మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని కాన్గల్‌లో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దోమల కొమురయ్య ఎద్దు వ్యవసాయ పొలం పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా ప్రసమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మృత్యువాత పడింది. ఎద్దు మృతితో తనకు సుమారు రూ. 70 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు కన్నీటి పర్యంతం అయ్యాడు. అధికారులు స్పందించిన తనకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

ఊరకుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రం శివారులో గొర్రెల మందపై ఊర కుక్కలు దాడిచేయడంలో 12 గొర్రెలు మృతి చెందాయి. సోమవారం రాత్రి చిన్నశంకరంపేటలోని గొడుగుమర్రి వద్ద గొర్రెలను షెడ్డులోకి పంపగా.. కుక్కలు దాడిచేసి హతమర్చాయి. కురమ్మపల్లికి చెందిన పుల్ల స్వామి గొర్రెల మందను షెడ్డులో పెట్టి తినేందుకు ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరిగా కుక్కలు దాడిచేశాయని తెలిపారు. సుమారు రూ.60 వేల నష్టం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

ఫోన్ హ్యాక్ చేసి నగదు డ్రాకు యత్నం

పటాన్‌చెరు టౌన్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఫోన్‌హ్యాక్ చేసి నగదు డ్రా చేసుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఫోన్‌కు అపరిచిత వ్యక్తులు అక్టోబర్ 31 తేదీన హ్యాక్ చేశారు. అనంతరం ఆ ఉద్యోగి ఫోన్ నుంచి రూ. 45 వేల నగదును డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితురాలు వెంటనే తన ఫోన్ చెక్ చేయగా.. ఓ గేమింగ్ యాప్ పిల్లలు ఇన్‌స్టాల్ చేసినట్లు గుర్తించి వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అయితే బాధితురాలి రూ.45 వేల నగదును హోల్డ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థినిపై హత్యాయత్నం

నిందితుడి అరెస్టు

మెదక్ కలెక్టరేట్: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థినిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు. సోమవారం ఉదయం విద్యార్థిని దివ్యకృపపై ప్రేమ పేరుతో కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తృటిలో ఆమె ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడింది. నిందితుడు ధనసిరి చైతన్యను మెదక్ బస్టాండ్‌లో పట్టుకున్నామని డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా ఆకతాయిలు వేధించినట్లు గుర్తిస్తే వెంటనే షీ టీంకు గాని, 100 కాల్ గాని స్థానిక సీఐ నెంబర్ గాని ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి

ఎమ్మెల్యే మాణిక్‌రావు

- డీడీఎస్ మహిళల పట్టుదలతో అంతర్జాతీయంగా గుర్తింపు: మీరా
- జహీరాబాద్‌లో చిరుధాన్యాల చెల్లెండ్ల సమాఖ్య జాతీయ సదస్సు ప్రారంభం

జహీరాబాద్ టౌన్: డక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ భారత చిరుధాన్యాల సమాఖ్య ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలోని కేవీకే ప్రాంగణంలో రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. దేశంలోని 15 రాష్ట్రాలకు చెందిన స్వచ్ఛంద సంస్థలు, చిరుధాన్యాల చెల్లెండ్లు, ఎన్‌జీవోస్ ప్రతినిధులు వంద మంది వరకు పాల్గొన్నారు. 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటిండంతో, దాన్నే ఇంకా ఎలా ముందుకు తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. చిరుధాన్యాల చెల్లెండ్లు ఎదర్కొంటున్న సాగు, మార్కెటింగ్, పశువులు, పక్షులు తదితర సమస్యల పరిష్కార అంశాలపై చర్చించనున్నారు. చిరు ధాన్యాలను పీడీఎస్‌లో చేర్చాలని సదస్సులో తీర్మానం చేయనున్నారు. ఈ సదస్సును ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రారంభించారు. సదస్సులో ఐసీఆర్ అటారి జోన్ టిన్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా, నాబార్డ్ జిల్లా డిప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణతేజ తదితరులు పాల్గొన్నారు. డీడీఎస్ బోర్డు సభ్యులు రాం ఆంజనేయులు, రుక్మణయ్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్య స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



డీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

40 ఏళ్ల నుంచి చిరుధాన్యాల సాగు

పస్తాపూర్ కేంద్రంగా పనిచేస్తున్న డీడీఎస్ 40 సంవత్సరాల నుంచి చిరుధాన్యాల సాగుకు కృషి చేస్తుందని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. సంస్థ డైరెక్టర్ దివంగత సతీష్ మహిళా రైతులను ప్రోత్సహించి వారితో మిలెట్స్ పంటల పండించారన్నారు. పేద రైతుల గుర్తింపు కోసం దశాబ్దాలుగా ఆయన పోరాటం చేశారని కొనియాడారు. మహిళా రైతులు ఆర్థింగా బలపడేందుకు ప్రభుత్వాలు చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని కోరారు. నాబార్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ స్వాతి తివారీ మాట్లాడుతూ తక్కువ నీరు, ఎరువులతో చిరుధాన్యాలు పండుతాయన్నారు. చిరుధాన్యాల చెల్లెండ్లు చేస్తున్న కృషికి తాము అన్ని విధాలుగా సహకారం అందిస్తామన్నారు. అంతకు ముందు డీడీఎస్ వ్యవస్థాపకులు దివంగత సతీస్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. చిరుధాన్యాల చెల్లెండ్ల సమాఖ్య సభ్యులను ఘనంగా సన్మానించారు.



మహిళల కృషితో అంతర్జాతీయ గుర్తింపు

డీడీఎస్ మహిళల పట్టుదలతోనే చిరుధాన్యాలకు అంతర్జాతీయంగా మంచి గుర్తింపు వచ్చింది. చిరుధాన్యాల ఆవశ్యకతను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. మహిళల కృషి వల్ల 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా జరుపుకొనే అవకాశం దక్కింది. ఆహారంలో పోషకాలు పెంచడానికి కోట్లు ఖర్చు చేస్తున్నారు, కానీ పోషకాలు పుష్కలంగా ఉన్న చిరుధాన్యాలను పక్కన పెట్టడం దురదృష్టకరం. చిరు ధాన్యాలు దండగ కాదు పండగని డీడీఎస్ మహిళలు కష్టపడ్డారు. -మీరా, ఐసీఆర్ అటారి డైరెక్టర్



చిరుధాన్యాల చెల్లెండ్ల సమాఖ్య సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం



సదస్సుకు హాజరైన పలు రాష్ట్రాల స్వచ్ఛంద సంస్థల సభ్యులు



ధర్మాసాగర్‌లో కొనుగోలు కేంద్రం వద్ద వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఈఓ

తేమశాతంపై తకరారు

- 14 శాతం ఉంటేనే కొనుగోలు చేస్తామన్న నిర్వాహకులు
- చెప్పేదొకటి.. చేస్తున్నదొకటని రైతుల ఆగ్రహం
- ఏఈఓ, నిర్వాహకుల నిలదీత

కొడిపల్లి(నర్సాపూర్): వరి ధాన్యం కొనుగోలులో తేమశాతంపై అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. తేమశాతం 14 ఉంటేనే కొనుగోలు చేస్తామని నిర్వాహకులు చెప్పడంతో ఏఈఓను కొడిపల్లి మండలం ధర్మాసాగర్, సదాశివపల్లి రైతులు నిలదీశారు. మండలంలోని ధర్మాసాగర్‌లో ధర్మాసాగర్, పాంపల్లికి సంబంధించి పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. మంగళవారం కొనుగోలును ప్రారంభించారు. తేమశాతం 14 ఉంటేనే కొనుగోలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. దీంతో అక్కడికి చేరుకున్న ఏఈఓ సాహితిని సదాశివపల్లి మాజీ సర్పంచ్ బోయిని వీరయ్య, రైతులు ఆంజనేయులు తదితరులు ప్రశ్నించారు. ప్రభుత్వం ధాన్యంలో తేమశాతం 17 ఉంటే కొనుగోలు చేయాలని చెబుతుండగా.. 14, 15 తేమశాతం ఉంటేనే కొనుగోలు చేస్తామని చెప్పడం ఏమిటని రైతులు ప్రశ్నించారు. కాగా ఏఈఓ, నిర్వాహకులు మాట్లాడుతూ అధికారుల సూచనల మేరకు తాము కొనుగోలు చేస్తామని నిర్వాహకులు స్పష్టం చేశారు. కాగా, ధాన్యం కొనుగోలు విషయమై కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇరవై రోజులుగా కల్లాల వద్ద ధాన్యం ఆరబోస్తూ ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడు కొత్తగా తేమశాతంపై కొర్రీలు పెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కాగా, ఈ విషయం జిల్లా అధికారులకు తెలియచేస్తామని ఏఈఓ తెలిపారు.

కొనుగోలు వేగవంతం చేయాలి

జెడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న స్వప్న

హత్నూర(సంగారెడ్డి): రైతులు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో స్వప్న అన్నారు. మంగళవారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ధాన్యం తేమశాతం చూసి వెంటనే తూకం వేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గన్ని బ్యాగులు, సుతిల్ తాడులు అందుబాటులో ఉంచాలన్నారు. వర్షం వస్తే ధాన్యం తడవకుండా పాల్దిన్ టాపర్లు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీపీఎం కొమరయ్య, తహసీల్దార్ పర్వీన్ షేక్, ఏపీఎం దేవేందర్ మండలంలోని దౌలాపూర్, నాగుల్దేవులపల్లి, హత్నూర, గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు.

శేఖాపూర్ తండాలో కార్డెన్ సెర్చ్



కార్డెన్ సెర్చ్ సందర్భంగా తండా ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

- 10మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 25 మోటారు సైకిళ్లు, ఒక ఆటో సీజ్
- డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

జహీరాబాద్: జహీరాబాద్ మండలంలోని శేఖాపూర్ తండాలో మంగళవారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మోటారు సైకిళ్లు, ఒక ఆటోను సీజ్ చేశారు. 10మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆదేశాల మేరకు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని పోలీసులు, జిల్లా స్పెషల్ పోలీసులు మొత్తం 120 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తండాలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సరిహద్దు స్మగ్లర్లతో కాంటాక్టులో ఉన్న 10 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అదే విధంగా సరైన పత్రాలు లేని వాహనాలు సీజ్ చేశామన్నారు. అనుమానాస్పదంగా కనిపించిన అపరిచితులపై నిఘా ఉంచాలని, గంజాయి, గుట్కా, గుడుంబా విక్రయదారులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. జిల్లాలో ఎవరైనా గంజాయి సాగు చేసినా అట్టి వ్యక్తులపై పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. అట్టి వ్యవసాయ భూమిని జప్తుచేసి ప్రభుత్వానికి అప్పగిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఎలాంటి సంక్షేమ పథకాలు కూడా అందవని హెచ్చరించారు. నేర ప్రవృత్తి కలిగిన ఎవరైనా జిల్లా పోలీసుల సమక్షంలో లొంగిపోవాలని సూచించారు. జిల్లాలో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు 8712656777 నంబర్ లేదా 100కు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సీఐలు శివలింగం, హనుమంతు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామునాయుడు, ఏఐలు, ఆర్‌ఐలు కాశీనాథ్, రాజశేఖర్, రామావావు, డానియల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి



అశోక్ (ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన రైతు కొంతం అశోక్(48) వ్యవసాయ పనుల నిమిత్తం బైక్‌పై జగదేవ్‌పూర్ వచ్చారు. అనంతరం పెట్రోల్ పోసుకుందామని వెళుతుండగా ప్రజ్ఞాపూర్ నుంచి జగదేవ్‌పూర్ వైపు వస్తున్న టాటా ట్రాలీ ఆటో బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన అశోక్.. అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్‌ను పోలీసులు ఆదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నా రు. అశోక్ కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరించేవారు. అశోక్ మృతి చెందడం పట్ల డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

వైష్ణవి కుటుంబానికి న్యాయం చేయాలి

- నారాయణ క్యాంపస్ ఎదుట కుటుంబ సభ్యులు, విద్యార్థుల ఆందోళన
- యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు



జిన్నారం (పటాన్‌చెరు): మండల పరిధిలోని కాజీపల్లి శివారులలోని నారాయణ కళాశాల క్యాంపస్ ఎదుట మంగళవారం ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థిని తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళనకు దిగారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నారాయణ కళాశాలలో సోమవారం సాయంత్రం ఇంటర్ విద్యార్థిని వైష్ణవి బలవన్మరణానికి పాల్పడిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న విద్యార్థులు, విద్యార్థిని తల్లిదండ్రులతో కలిసి క్యాంపస్ గేటు ఎదుట బైఠాయించారు. కూతురిని కోల్పోయిన తల్లిదండ్రుల రోదనలు స్థానికులను కలిచివేశాయి. వీరికి మద్దతుగా పలు విద్యార్థి సంఘాల నాయకులు తరలివచ్చి మద్దతు ప్రకటించారు. బీఆర్‌ఎస్వీ, ఎస్‌ఎఫ్ఐ నవతెలంగాణ విద్యార్థి శక్తి సంఘాల నాయకులు సభ్యులు క్యాంపస్ ప్రధాన గేటు ఎదుట నిరసన తెలిపారు. యాజమాన్యం తీరుపై మండిపడుతూ ప్రభుత్వం గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాంగణం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బొల్లారం, జిన్నారం సీఐలు గంగాధర్, సుధీర్ కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు. లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకొని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కాగా విద్యార్థిని వైష్ణవి మృతదేహానికి పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికుప్పల వాసు, కుత్బుల్లాపూర్ శాఖ అధ్యక్షుడు అఖిల్, ప్రధాన కార్యదర్శి యశ్వంత్ కుమార్, నవతెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కుమార్, ప్రధాన కార్యదర్శి సాయికిరణ్, సభ్యులు అఖిల్, జితేందర్ సాయి, జయంత్, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించాలి

డీఐఈఓ రవీందర్ రెడ్డి

సిద్దిపేట ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ విద్యార్థులు సకాలంలో పరీక్ష ఫీజులు చెల్లించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి (డీఐఈఓ) రవీందర్ రెడ్డి, మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బోర్డు పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 26 వరకు గడువును నిర్దేశించినట్లు చెప్పారు. ప్రథమ సంవత్సరం ఆర్ట్స్ అండ్ సైన్స్ ద్వితీయ సంవత్సరం ఆర్ట్స్ విద్యార్థులు రూ. 520, ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులు, ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు రూ.750 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.100 ఫైన్‌తో డిసెంబర్ 4 వరకు, రూ 500ల ఫైన్‌తో డిసెంబర్ 11 వరకు, రూ.1000 ఫైన్‌తో డిసెంబర్ 18 వరకు, రూ.2000 ల ఫైన్‌తో డిసెంబర్ 27 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులంతా సకాలంలో ఫీజు చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, మంచి మార్కులతో ఇంటర్మీడియట్లో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.

జక్కపల్లిలో భూవివాదం

ఇరువర్గాల ఘర్షణ

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మండలం జక్కపల్లిలో మంగళవారం భూవివాదంలో రెండు వర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. జక్కపల్లిలోని సర్వే నంబర్ 86/2 లో ప్రభుత్వ, పట్టా భూమి కలుపుకొని ఉంది. గ్రామానికి చెందిన ఓ కుటుంబం 1971లో కొంత భూమిని సాదా బైనమాతో గిరిజనులకు విక్రయించారు. భూమిని కొనుగోలు చేసిన గిరిజనులు పట్టా చేసుకోవడంతో అట్టి భూమి అప్పట్లో విక్రయించిన వారి పేరును రికార్డుల్లో వస్తుంది. రికార్డుల్లో తమ పేరు మీద భూమి ఉండడంతో అదే సర్వే నంబర్‌లో ఉన్న పక్క భూమిని ఇతరులకు విక్రయించి హద్దులు పాతారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించడంతో స్థానిక రెవెన్యూ అధికారులు ఆ భూమిని సర్వే చేసి ఇది ప్రభుత్వ భూమి అని తేల్చారు. దీంతో కొనుగోలు చేసిన గిరిజనులకు, విక్రయించిన వారికి మధ్య వివాదం నెలకొని ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. సంఘటన స్థలానికి ఎస్సై లింగం సిబ్బందితో తరలి వెళ్లి ఇరు వర్గాలను చెదరగొట్టారు. త్వరలో అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్, ఆర్డీఓ గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253908]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావాలి. ఫ్రీ వసతి, ఫుడ్ జీ : 20K. Ph: 8977639662, 8977639663 [SCA24000542]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించ చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

దుబ్బాక శివారులో ఆటో బోల్తా

10 మంది విద్యార్థులకు గాయాలు



అదుపు తప్పి బోల్తా కొట్టిన ఆటో

దుబ్బాకటౌన్: ఆటో బోల్తా పడిన ఘటనలో 10 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ ఘటన దుబ్బాక శివారులోని చీకోడ్ గ్రామానికి వెళ్లే ప్రధాన దారిలో జరిగింది. దుబ్బాక మండలం కమ్మర్‌పల్లికి చెందిన యాదగిరి తన ఆటోలో గ్రామం నుంచి విద్యార్థులను దుబ్బాకలో ఉన్న వివేకానంద విద్యాలయానికి రోజూ తీసుకెళ్తుంటాడు. మంగళవారం ఆటోలో పది మందిని తీసుకుని కమ్మర్‌పల్లి నుంచి పాఠశాలకు వస్తుండగా దుబ్బాక శివారులో ఆటో అదుపు తప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. దీంతో పది మంది గాయపడ్డారు. బాబు, రోహిత్ తలకు, ముఖానికి గాయాలయ్యాయి. చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మిగతా ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని దుబ్బాకలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో ఎవరికి కూడా ప్రాణనష్టం కాకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో అతివేగం, అజ్రాగత్తగా ఆటో నడపడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతున్న విద్యార్థులను మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ పరామర్శించారు.

కాపాడిన చెట్టు కొమ్మ

ఆటో బోల్తా కొట్టే సమయంలో చెట్టు కొమ్మ ఆటోకు ఆధారంగా నిలిచింది. ఒకవేళ ఆ కొమ్మే లేకుంటే ఆటో పల్టీ కొట్టి పెను ప్రమాదం జరిగేదని స్థానికులు తెలిపారు.

కార్తీక మాసం.. శుభప్రదం

- కేతకీలో మొదలైన కార్తీక మాససందడి
- దీపారాధన చేస్తున్న భక్తులు
- శివాలయాలకు భక్తుల తాకిడి
- పౌర్ణమి రోజు ప్రత్యేక కార్యక్రమాలు



ఝరాసంగంలోని శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయం

ఝరాసంగం(జహీరాబాద్): తెలుగు మాసాల్లో కార్తీకమాసం అత్యంత శుభప్రదంగా పరిగణిస్తుంటారు. ఈ పవిత్ర పుణ్యమాసం 2 నుంచి ప్రారంభమైంది. కార్తీక మాసం ప్రారంభం కావడంతో జిల్లాలోని శైవ క్షేత్రాలు భక్తుల శివనామస్మరణతో కిటకిటలాడుతున్నాయి. దీపారాధనతోపాటు తులసి కల్యాణం, సత్యనారాయణ స్వామి వ్రతాలు చేస్తుంటారు. భక్తులు తెల్లవారుజామున చన్నీటి నీటితో నది స్నానాలు, గుండంలలో పవిత్ర పుణ్య స్నానాలు ఆచరిస్తుంటారు. దీపారాధనతో పుణ్యం లభిస్తుందని భక్తుల విశ్వాసం. అందుకు భక్తిశ్రద్ధలతో దీపారాధన చేసి వదులుతారు. అంతేకాకుండా ఉపవాసంతో శివుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేస్తూ శివ ధ్యానంలో పరవశించిపోతారు.

కేతకీలో మొదలైన సందడి

శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయంలో కార్తీకమాస సందడి ప్రారంభమైంది. రోజురోజుకీ భక్తుల తాకిడి పెరుగుతుంది. అమృతగుండంలో పవిత్ర పుణ్య స్నానాలు ఆచరించి, పౌర్ణమి నాడు గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు పూజలు చేస్తున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఇందుకు ఆలయ ఆవరణలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. ఇప్పటికే ఆలయానికి విద్యుత్ దీపాలతో అలంకరణలు చేశారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



కార్తీక మాసం సందర్భంగా కేతకీ ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు ఏర్పాట్లు చేశాం. పౌర్ణమిన పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, గంగాహారతి తదితర అందరి సహకారంతో ఘనంగా నిర్వహిస్తాం.

– శశిధర్, ఆలయ ఈఓ, కేతకి సంగమేశ్వర ఆలయం, ఝరాసంగం